క్లుప్తంగా

పారదర్శకంగా రీజినల్ మెడికల్ బోర్డు



రీజినల్ మెడికల్ బోర్డు కార్యకలాపాలను పరిశీలిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో రీజినల్ మెడికల్ ఎగ్జామినేషన్ బోర్డు నిర్వహణను పారదర్శకంగా చేపడుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య స్థితిపై ఈ బోర్డు సమీక్షించి, ఆరోగ్య పరీక్షల ఫలితాలకు అనుగుణంగా వైద్య బృందాలు వాస్తవ నివేదికలు అందిస్తున్నాయన్నారు. అతి త్వరలో ఈ సేవలను మరింత ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్యకుమారి బోర్డు కార్యకలాపాలను పరిశీలించారు. ఆమె వెంట జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, సైకియాట్రీ విభాగాల వైద్య నిపుణులు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



విజయరాయుడుపాలెంలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: పర్యావరణానికి ముప్పును కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు కోరారు. మండలం విజయరాయుడు పాలెంలో గురువారం ఆయన పర్యటించి పంచాయతీ, సచివాలయ సిబ్బందికి, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త విడిగా సేకరించాలన్నారు. తర్వాత ఆయన పంచాయతీ సిబ్బందితో ప్రజలను కలసి వీధులలో చెత్త, చెదారం వేయకుండా పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను విడదీసి ఇవ్వాలన్నారు. తడిచెత్త నుంచి కంపోస్ట్ ఎరువును తయారుచేస్తారని, దానివల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించి, వివాహాది శుభకార్యాలు, ఇతర ఫంక్షన్లలో ప్లాస్టిక్ గ్లాస్‌లు, కవర్లు వినియోగించవద్దన్నారు. గ్రామ సర్పంచ్ వెలుగుబంటి సీతారామరాఘవ, కార్యదర్శి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతలో సామాజిక బాధ్యత పెంచాలి



ఓరియెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యువతలో సామాజిక బాధ్యత పెంపొందించి సమాజ పరిస్థితులపై అవగాహన పెంచాలని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు పేర్కొన్నారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ) ఓరియెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సమస్యలు అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి తమ భాగస్వామ్యం అందించాలని, ఈ కార్యక్రమం ద్వారా సామాజిక స్పృహ, నాయకత్వ నైపుణ్యాలు పెరిగేలా కార్యక్రమాలు రూపొందించబడ్డాయన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు దాసరి మధుప్రసాద్, రాంబాబు, కామర్స్ విభాగాధిపతి లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూరింటి నిర్మాణానికి ఆర్థిక సాయం

కరప: విశ్రాంత ఉద్యోగి వితరణతో కరపలోని నిరుపేదకు ఆర్థిక సాయమందింది. స్థానిక గ్రామశివారు నక్కావారి ఎస్సీ వీధికి చెందిన ఉల్లం దేవుడు తాటాకు ఇంటి పైకప్పు ఇటీవలి వర్షాలకు ఎగిరిపోవడంతో ఆ కుటుంబం నీడను కోల్పోయింది. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఈ విషయాన్ని విశ్రాంత చీఫ్ లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు(కాకినాడ)కు ఈ విషయాన్ని వివరించగా ఆయన రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ సొమ్మును తాతీలు గురువారం దేవుడుకు అందజేశారు.

గ్రామ దేవతల ఊరేగింపు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో గురువారం గ్రామ దేవతలను ఊరేగించారు. ఊరికి మంచి జరగాలని వేటకు వెళ్లే మత్స్యకారులు సురక్షితంగా మత్స్య సంపదతో చేరాలని కోరుతూ అమ్మవార్ల వేష ధారణలతో మహిళలు గ్రామంలో తిరిగి ప్రజలకు దీవెనలు ఇచ్చారు. పెద్ద దేవ, చిన్న దేవ, మత్స్య ముత్యం, కమ్మిలమ్మ, చిలకమ్మ, బంగారమ్మ, ముత్యాలమ్మ, రెక్కలమ్మ, నాగదేవత వంటి అమ్మవార్ల రూపాల్లో వారు గ్రామంలో ఊరేగారు. ఉప్పాడ తీరంలో సముద్రానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వారి వద్ద ఉన్న పసుపు, కుంకుమలను భక్తులకు అందించారు.

ఆదాయం బాగున్నా వసతులు అరకొరే

ఓసారి సర్వర్లు పనిచేయవు.. మరోసారి ఆధార్ అనుసంధానం అవదు.. విద్యుత్ సరఫరా నిలిచిపోతే చీకట్లోనే లావాదేవీలు... ఇవీ సబ్ రిజిస్ట్రార్లు కార్యాలయాల్లో ఎదురయ్యే సమస్యలు. రూ.కోట్ల ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు కనిపించవు. క్రయవిక్రయాల్లో కక్షిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నెన్నో..

- రిజిస్ట్రేషన్ల శాఖలో విద్యుత్ కష్టాలు
- వేధిస్తున్న సాంకేతిక సమస్యలు
- నిరుపయోగంగా ఇన్వర్టర్
- అప్‌డేట్ కాని కంప్యూటర్లతో అవస్థలు



విద్యుత్ సరఫరా నిలచిపోయి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న క్రయవిక్రయదారులు



నిరుపయోగంగా ఉన్న ఇన్వర్టర్లు

కాకినాడ లీగల్: ప్రభుత్వానికి ఆదాయం తీసుకురావడంలో ఆ శాఖది ఎప్పుడూ అగ్రస్థానమే. ఆధునికతను అందిపుచ్చుకోవడంలో మాత్రం అట్టడుగు స్థానంలో ఉండిపోయింది. పనిచేయని ఇన్వర్టర్లు.. కాలం చెల్లిన కంప్యూటర్లు.. అయితేనే రూ.కోట్లు ఆర్జిస్తోంది ఆ శాఖ. అదే మరి రిజిస్ట్రేషన్ శాఖ ఘనత. ఆన్‌లైన్ విధానంలో అనేక మార్పులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్టు చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.

కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతాయి. ఇన్వర్టర్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉంది. అయినప్పటికీ చీకటిలోనే లావాదేవీలన్నీ సాగించాల్సిన పరిస్థితి అక్కడి సిబ్బందిది. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన కక్షిదారులు సైతం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. సమస్యను సబ్ రిజిస్ట్రార్లు ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు.

కరెంటు పోతే ఇబ్బందులు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలో నిత్యం కంపూటర్ల ద్వారానే మొత్తం ప్రక్రియ జరుగుతుంది. ఆస్తులు, భూముల విక్రయాలు, గిఫ్ట్ డీడ్స్, మార్ట్‌గేజ్ లోన్ రిజిస్ట్రేషన్లు ఇలా అనేక రకాల లావాదేవీలన్నీ కంప్యూటర్ల ద్వారానే నడుస్తాయి. స్టాంప్ పేపర్లు, దస్తావేజు నకల కాపీ, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా తీసుకోవాలి. లావాదేవీ ఏదైనా డాక్యుమెంట్ల స్కానింగ్ ప్రక్రియ ఉంటుంది. కంప్యూటర్లలో అనుసంధానంగా ఉండే స్కానర్ల ద్వారా డాక్యుమెంట్లను స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో

> **సమస్యను ఉన్నతాధికారులకు పంపించాం**
>
> 
>
> సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా మెరుగైన సేవలు అందిస్తాం. త్వరలో ఈ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి.
>
> జేయూఎస్ జయలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్

సరైన కంపూటర్లు, స్కానర్ల, ఇన్వెర్టర్లు లేక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు సుమారు 17 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేశారు. అలాగే ఏడాది జనవరి 1 నుంచి జూలై రెండో తేదీ వరకు 8600 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వీటిలో ఒకొక్క డాక్యుమెంట్‌కు కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు వినియోగదారు నుంచి రూ.500 చొప్పున యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ఏడాదికి సుమారు 85 లక్షలు పైబడి యూజర్ చార్జీలు వస్తున్నాయి. ఈ నిధులు ప్రభుత్వఖాతాకు జమ అవుతాయి. తిరిగి వాటిని సద్వినియోగం చేస్తున్న దాఖలాలు కనిపించడంలేదు.

వైభవంగా ఇండియన్ క్రిస్టియన్ డే

రోగులకు వైద్య శిబిరాల నిర్వహణ



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



కాకినాడ జిల్లా ఏఐసీసీ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో వైద్య శిబిరం

బోట్‌క్లబ్: నగరంలో గురువారం ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలను ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక మెక్లారిన్ గ్రౌండ్‌లో నిర్వహించారు. దేశ నిర్మాణం, అభివృద్ధిలో భారత క్రైస్తవ సమాజ పాత్రను జ్ఞాపకం చేసుకుంటూ ఏటా జూన్ 3న ఇండియన్ క్రిస్టియన్ డే నిర్వహిస్తున్నట్టు విశాఖపట్టణానికి చెందిన మిరాకిల్ సెంటర్ అధినేత, అంతర్జాతీయ ప్రసంగీకులు శ్యామ్యూల్ కర్మోజి అన్నారు. ఈ సందర్భంగా యునైటెడ్ క్వయర్ వారి సుమధుర క్రైస్తవ భక్తిగీతాలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఎస్ విలియమ్స్ రూపొందించిన ప్రత్యేక బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగరంలో ఎస్.అచ్యుతాపురం, జగన్నాథపురం, పప్పుల మిల్లు, సర్పవరం జంక్షన్, దుమ్మలపేట, మహాలక్ష్మినగర్‌లో మెగా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రముఖ ఆస్పత్రుల వైద్యులు రోగులకు సేవలందించారు. మద్రాసు ప్రీమియం కాఫీ సహకారంతో రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సుమారు రెండు వేల మంది ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు జోసఫ్ బెన్ని, అధ్యక్షుడు సామ్యూల్ సాగర్, ప్రధాన కార్యదర్శి శీరం ఐసాక్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రిక్కీ గూటం, ప్రధాన కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలోని అర్బన్ 8 డివిజన్లు, రూరల్ గ్రామాలలో గురువారం ఇండియన్ క్రిస్టియన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రార్థన మందిరాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పవరం జంక్షన్‌లో ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానికులు శిబిరంలో పాల్గొని బీపీ, షుగర్, వంటి వైద్య పరీక్షలు చేయించుకుని మందులు ఉచితంగా అందుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ నేతలు రిక్కీ గూటం, బెన్నీ, వెన్నపు పాల్, స్టీఫెన్ ఆనంద్, పాల్ రాజ్‌కమల్, జాషువా గిరి, తదితరులు పాల్గొన్నారు. రమణయ్యపేటలోని రేస్ ఆఫ్ పీస్ చర్చ్‌లో సీవైఎఫ్ డైరెక్టరు బీహెచ్‌వీ మూర్తిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో ఘనంగా జరుపుకొన్నారు, పలువురు పేదలకు నగదు, మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వనట చక్రవర్తి ఎస్వీఆర్

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు



కాకినాడలో నాగమల్లితోట జంక్షన్ సమీపంలో ఎస్వీ రంగారావు కాంస్య విగ్రహం వద్ద జయంతి కార్యక్రమంలో రూరల్ వైఎస్సార్ సీపీ నాయకులు

కాకినాడ రూరల్: తెలుగు చలన చిత్ర సీమలో విశ్వనట చక్రవర్తిగా ఎస్వీ రంగారావు పేరొందారని జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. సామర్ల వెంకట రంగారావు (ఎస్వీఆర్ జయంతిని పురస్కరించుకుని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటరు కురసాల కన్నబాబు పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు కాకినాడ నాగమల్లితోట జంక్షన్ సమీపంలోని ఎస్వీ రంగరావు కాంస్య విగ్రహానికి గురువారం ఘనంగా నివాళులర్పించారు. జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాలలో ఆయన పోషించిన పాత్రల జీవం పోసిన ఎస్వీ రంగారావు దాదాపు మూడు దశాబ్దాల పాటు సుమారు 3 వందల చిత్రాలలో నటించారని నాయకులు నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, పెంటకోట నాగబాబు, పుల్ల చందు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రపతి పురస్కారం అందుకోవడంతో పాటు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్‌లో బహుమతిని పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పల్లంరాజు, నల్ల రాణి, నాగేశ్వరరావు, ధనరాజు, భవానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో రమణయ్యపేటలో, టీడీపీ ఎంపీ, ఎమ్మెల్సీలు సానా సతీష్, పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు ఎస్వీ రంగారావుకు నివాళులర్పించారు.

ఫైర్ ఆఫీసర్ నుంచి నటన వైపు..

బోట్‌క్లబ్: నటనపై ఉన్న మక్కువతో ఎస్వీ రంగారావు తాను చేస్తున్న ఉద్యోగాన్ని సైతం వదులుకున్నారని కాపు సద్భావన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ అన్నారు. ఎస్వీ రంగారావు జయంతి సందర్భంగా గురువారం స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న నట చక్రవర్తి ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చదువు పూర్తయిన తర్వాత ఆయన ఫైర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించారని, నటపై ఉన్న మక్కువతో ఉద్యోగానికి రాజీనామా చేసి దశాబ్దాల పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చలనచిత్రాల్లో ఎనలేని కీర్తి గడించారన్నారు. పాతాళభైరవి, మాయాబజార్, నర్తనశాల వంటి చిత్రాలకు ఎన్నో పురస్కారాలు వచ్చాయన్నారు.

అవును.. కబ్జా నిజమే..



చెరువుగా తవ్వేసిన పంచాయతీ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, గ్రామస్తులు

- 9 సెంట్ల స్థలం ఆక్రమణ
- నిగ్గు తేల్చిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్

కరప: మండలం యండమూరులో పంచాయతీ అధికారులు కబ్జాకు గురైన స్థలాన్ని సర్వే చేసి తొమ్మిది సెంట్లభూమి ఆక్రమణకు గురైందని గుర్తించారు. యండమూరులోని గ్రామపంచాయతీకి చెందిన స్థలాన్ని ఒకరైతు ఆక్రమించుకుని చేపల పెంపకానికి తన భూమితో పాటు చెరువుగా తవ్వేశారు. ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో 'దర్జాగా పంచాయతీ స్థలం కబ్జా' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి గ్రామ కార్యదర్శి పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం స్పందించారు. పంచాయతీ సిబ్బంది, సచివాలయం సర్వేయర్‌తో స్థలాన్ని సర్వే చేయించి 9 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నట్టు అధికారులు నిర్ధారించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామకార్యదర్శి, అధికారులు, గ్రామస్తులు, రైతుతో సమావేశమై ఆక్రమించిన స్థలంపై చర్చించారు. వర్షాలు తగ్గాక రెండు రోజుల్లో మట్టి తోలించి, మెరకచేసి పంచాయతీకి అప్పగించేందుకు ఆక్రమించుకున్న రైతు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగిందని కార్యదర్శి బ్రహ్మానందం తెలిపారు. పంచాయతీ స్థలం ఆక్రమణను వెలుగులోకి తీసుకు వచ్చి, తిరిగి పంచాయతీకి వచ్చేలా చేసిన 'సాక్షి'కి మాజీ సర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, యండమూరు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డాదికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వడ్డాది చిట్టి రామారావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా తొండంగి గ్రామానికి చెందిన వడ్డాది చిట్టి రామారావుకు అరుదైన గౌరవం దక్కింది. మేనేజ్‌మెంట్, నాయకత్వ, మార్గదర్శకత రంగాల్లో కొన్నేళ్లుగా ఆయన చేస్తున్న కృషికి అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక ఫ్రాంక్‌ఫర్డ్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈ పురస్కారాన్ని ఢిల్లీలోని పద్మశ్రీ పురస్కార గ్రహీత జితేందర్‌సింగ్ షంటీ, ఢిల్లీ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ చైర్మన్ డాక్టర్ సుమిత్ సేథీ చేతుల మీదుగా అందుకున్నారు. ఐబీఎం జనరల్ మేనేజర్‌గా ఉన్న రామారావు తొండంగిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్, కాకినాడలో గ్రాడ్యుయేషన్, లక్నోలో మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించారు. కాకినాడ ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలకు బోర్డు స్టడీస్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. ఈ సందర్భంగా రామరావును పలువురు అభినందించారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోస్టర్లను పట్టణ, గ్రామ ఆరోగ్య కేంద్రాల్లో అతికించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఐవో సుబ్బరాజు, గణాంకాల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపై వదిలితే కేసులు

కాకినాడ రూరల్: పశువులను రోడ్లుపైకి వదిలితే కేసులు నమోదు చేస్తామని ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు హెచ్చరించారు. ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో గురువారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి పర్యటించి స్వేచ్ఛగా రోడ్లుపై తిరుగుతున్న పశువులను గుర్తించారు. రోడ్లపై పశువులు సంచరించడం వలన వాహనచోదకులు, పాదచారులకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగితే సంబంధిత పశువుల యజమానులపై సెక్షన్ 281 బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు.



ఇంద్రపాలెంలో రోడ్డుపై పశులను పక్కుకు తరలిస్తున్న ఎస్సై వీరబాబు

1100 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ప్లాట్ నంబరు 222 వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 1100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. రాజమండ్రికి చెందిన విజిలెన్స్ సీఐ గోసాలకృష్ణ, ఎస్సైలు, సిబ్బందితో పాటు కాకినాడ రూరల్, అర్బన్ ఎంఎస్‌ఓలు వీరాస్వామి, శ్రీనివాస్ ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు 25 మూటల్లో 1100 కేజీల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని, 6ఏ కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడైన అమలాపురానికి చెందిన కొర్లపాటి సూర్య భరత్‌పై సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో వీర్వోలు సత్యం, తాతారావు పాల్గొన్నారు.



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం బస్తాలు

ప్రైవేటు పాఠశాలలపై నిరంకుశ వైఖరి

జిల్లా ప్రైవేటు విద్యాసంస్థల సమాఖ్య వ్యవస్థాపకుడు శ్రీవిజయ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహించామని జిల్లా ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యావ్యవస్థ పట్ల అధికారుల్లో మార్పు రాలేదన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పడేలా అసలైన లబ్ధిదారులకు ఆ ఫలాలు అందకుండా జరుగుతున్న తాత్సారాలకు ప్రైవేట్ పాఠశాలలను బాధ్యులను చేయడం తగదన్నారు. నిజమైన లబ్ధిదారులు రోడ్డుపై ఉన్నారని, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు సైతం ఉచిత విద్యాహక్కుచట్టం కింద ఉచితంగా అడ్మిషన్లు పొందుతున్నారన్నారు. లాటరీ విధానంలో పిల్లలను ఎంపిక చేసి ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నారని, వీటిలో ఎంత వరకూ నిజమైనవో పరిశీలనకు అవకాశం లేకుండా చేస్తున్నారన్నారు. అధికారుల వేధింపులకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గురవుతున్నాయన్నారు. ఈ ఏడాది ఎటువంటి నియమావళి లేకుండానే అడ్మిషన్లు కల్పించారని ధ్వజమెత్తారు. అనంతరం జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ

ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని కాకినాడ సిటీ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ వ్యవస్థాపకుడు శ్రీవిజయ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శివన్నారాయణరెడ్డి, దురానీ, ఏలియా,త్రినాథ్, ఆకెళ్ల శ్రీనివాస్, మేకల వెంకటరమణ పాల్గొన్నారు.

11.303 సెంట్ల భూమిని ఇప్పించండి

- లేదా తల్లికి వందనం లబ్ధి పొందేలా చర్యలు తీసుకోండి
- కరప రెవెన్యూ అధికారులపై మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు



రాయుడు గిరిజ

కాకినాడ సిటీ: తమకు భూములు లేకున్నా యండమూరు గ్రామంలో సుమారు 11.303 సెంట్లు భూమి ఉందని రెవెన్యూ అధికారులు చూపడం వల్ల మా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం దూరమైందని కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన రాయుడు శివప్రసాద్ భార్య రాయుడు గిరిజ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసేందుకు వచ్చిన ఆమె విలేకర్లతో మాట్లాడారు. తన పేరుతో యండమూరులో 509/2, 505/1 సర్వే నంబర్లలో మొత్తంగా 11.303 ఎకరాల భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదయ్యిందన్నారు. దీని వల్ల తల్లికి వందనం పథకానికి అర్హులైన తమ ఇద్దరు పిల్లలకు ఆ లబ్ధి రాలేదన్నారు. అధికారులు సదరు 11.303 ఎకరాల భూమిని తనకు అప్పగించాలని, లేని పక్షంలో తన పేరుతో ఉన్న భూమి వివరాలను తొలగించి తమ బిడ్డలకు తల్లికి వందనం పథకం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇప్పటికే ఈ విషయమై యండమూరు వీఆర్వోను, కరప తహసీల్దార్‌ను కలిసినా వారి నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. తర్వాత కాకినాడలోని జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రెండుసార్లు అర్జీలు పెట్టినా ఇంత వరకు సమస్యకు పరిష్కారం చూపలేదని రాయుడు గిరిజ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చేసిన తప్పిదం వల్ల తల్లికి వందనం పథకానికి దూరమయ్యామని, ఆ డబ్బులు రాకపోవడంతో తమ కుటుంబం చాలా ఇబ్బందులు పడుతుందన్నారు.

10, 11 తేదీల్లో ఉపవాస ప్రార్థన కూడికలు

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనల్లో భాగంగా 10, 11 తేదీల్లో పిఠాపురం మండలం విరవ చర్చిలో నిర్వహించనున్నట్లు మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. గురువారం దివిలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ఉజ్జీవ వేడుకలకు నిత్యం ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటిగంటకు, రాత్రి ఏడు గంటలకు ప్రార్థనా కూడికలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కూడికల్లో భాగస్వాములు కావాలని వారు కోరారు.